# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-10-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రజల విశ్వాసం, లక్షలాది మంది కార్యకర్తల అంకితభావమే తనకు గొప్ప శక్తి వనరులని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో రాష్ట్ర మంత్రి మండలి సమావేశం కొనసాగుతోంది.**

3. **రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.**

4. **గోదావరి డెల్టాలో శాశ్వత ముంపు సమస్యకు పరిష్కారం చూపేలా సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

==========================

ప్రజల విశ్వాసం, లక్షలాది మంది కార్యకర్తల అంకితభావమే తనకు గొప్ప శక్తి వనరులని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ప్రజా సేవలో 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప సభ'లో ప్రధానమంత్రి ఈరోజు ప్రసంగించారు. ప్రజలకు అంకితభావంతో సేవ చేసేందుకు మరింత శక్తి, ఉత్సాహాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుకున్నట్లు చెప్పారు. గత 25 ఏళ్లుగా ప్రజల నుంచి పొందిన విశ్వాసం, లభించిన అనుభవం తనకు విలువైన సంపద అని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..25.. సెకన్లు

--------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానమంత్రి నాయకత్వంలో 'వికసిత్ భారత్ 2047' లక్ష్యం దిశగా దేశం పురోగమిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

మరోవైపు విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలాగే ప్రధానమంత్రి 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా 'సేవా జ్యోతి యాత్ర' పేరుతో బైక్ ర్యాలీలు నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన యాత్రలో కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పాల్గొన్నారు. విజయవాడలో నిర్వహించిన బైక్ ర్యాలీలో రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో రాష్ట్ర మంత్రి మండలి సమావేశం కొనసాగుతోంది. ఈ సమావేశంలో హార్టికల్చర్ సమాచార వ్యవస్థ ఏపీఎచ్ఐఎంఎస్ ఏర్పాటు ప్రతిపాదనపై మంత్రివర్గం చర్చిస్తోంది. విధుల్లో మృతి చెందిన అర్హులైన ఆశా వర్కర్లకు గ్రాట్యుటీ, గిరిజన విద్యార్థులకు ఐఐటీ–జేఈఈ, నీట్ శిక్షణ కోసం విశాఖలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, భూ వర్గీకరణ మార్పులకు సంబంధించిన ప్రతిపాదనలపై కూడా మంత్రివర్గంలో చర్చ జరగనుందని అధికారులు తెలిపారు.

---------------------------

విశాఖపట్నం వేదికగా 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ప్రాంతీయ సదస్సు ఈరోజు ప్రారంభమైంది. ఈ సదస్సును కేంద్రమంత్రులు కె.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పరిశ్రమలు, పెట్టుబడులు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధిపై సదస్సులో చర్చించారు. ప్రభుత్వ రాయితీలు, రుణ సదుపాయాలపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని అన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

---------------------------

అమరావతిలో నిర్మాణ పనులకు అవసరమైన భూమి సమీకరణపై రైతులకు అవగాహన కల్పించాలని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో భూ సమీకరణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. రాజధానిలో ఇంకా ఎంత భూమి సమీకరించాల్సి ఉందనే అంశంపై మంత్రి చర్చించారు. రాజధానిలో చేపడుతున్న రహదారులు, ఇతర నిర్మాణాలకు అవసరమైన భూమి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి, వారి సందేహాలను నివృత్తి చేసి భూ సమీకరణకు సహకరించేలా చూడాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'ప్రజా సేవాతో దేశ సేవ' పేరుతో ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా "ఒకే దేశం, ఒకే రాజ్యాంగం" దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఆర్టికల్ 370 రద్దు గురించి ఈరోజు తెలుసుకుందాం.

జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ను కేంద్ర ప్రభుత్వం 2019

ఆగస్టు 5న రద్దు చేసింది. దీంతో జమ్మూ కశ్మీర్‌లో భారత రాజ్యాంగంలోని నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం 'ఒకే దేశం, ఒకే రాజ్యాంగం' దిశగా చేపట్టిన కీలక చర్యగా పేర్కొంది. అదే సమయంలో జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2019 ద్వారా అప్పటి రాష్ట్రాన్ని జమ్మూ కశ్మీర్, లడఖ్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించారు. ఈ మార్పులు 2019 అక్టోబర్ 31 నుంచి అమల్లోకి వచ్చాయి. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూ కశ్మీర్‌లో మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, పర్యాటకం, పారిశ్రామికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక సందర్భంలో పేర్కొంటూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

గోదావరి డెల్టాలో శాశ్వత ముంపు సమస్యకు పరిష్కారం చూపేలా సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 13 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్వహించిన లైడార్ సర్వే ఆధారంగా సమగ్ర నివేదికను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రణాళికల రూపకల్పనలో స్థానిక సాగునీటి సంఘాలు, ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. కాలువలు, డ్రెయిన్లు, లాకుల ఆధునీకరణతో పాటు, సముద్రంలో కలిసే డ్రెయిన్లలో పూడిక తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

---------------------------

విజయవాడలో ఈనెల 13 నుంచి 30వ తేదీ వరకు సరస్ మేళాను నిర్వహిస్తున్నామని పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ వెల్లడించారు. విజయవాడలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, సరస్ మేళాకు ఈనెల 15న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి స్వయంసహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో 650 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని శివనాథ్ తెలియజేస్తూ,..

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

మానవ దైనందిన జీవితంలో పత్తి ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు ఈరోజు ప్రపంచ పత్తి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ప్రతి ఏడాది అక్టోబర్ 7న ప్రపంచ పత్తి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పత్తి పంటకు మంచి భవిష్యత్తు కల్పించడం, పత్తి సాగు చేసే రైతులు, కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ప్రజలకు వివిధ రకాలుగా ఉపయోగపడే పత్తి పంటను వాణిజ్యపరంగా మరింత లాభదాయకంగా అభివృద్ధి చేయడంపై ఈ దినోత్సవం సందర్భంగా దృష్టి సారిస్తారు.

---------------------------

వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత అన్నారు. వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని మార్కాపురంలో నిర్వహించిన 2కె రన్‌ను స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డితో కలిసి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అడవులు, వన్యప్రాణులను సంరక్షించడం పర్యావరణ సమతుల్యతకు ఎంతో అవసరమన్నారు. నాగార్జునసాగర్–శ్రీశైలం పులుల అభయారణ్యం పరిధిలో 35 పులులు ఉన్నాయని, వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

======================